విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక


## సంక్షోభం నుంచి...సంక్షేమం దిశగా పయనం

### రెండేళ్ల పాలనపై చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్

**అమరావతి,జూన్12(చట్టం) న్యూస్ :** ఏపీలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా స్పందించారు. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, సమస్యలను వదిలి వెళ్తే.. అన్నింటినీ అధిగమిస్తూ సుపరిపాలనను అందిస్తున్నా మన్నారు. రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రాభి వృద్ధిలో సహకరిస్తున్న

మిగతా 2వ పేజీలో..






సంపుటి : 14 ● సంచిక : 148 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శనివారం 13 జూన్ 2026 ● పేజీలు : 8 ● వెల 2/-


## ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ

### నటుడు రాఘవ లారెన్స్ పోస్ట్



**చెన్నై,జూన్12 (చట్టం) న్యూస్ :** ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. ప్రజలు ఆమోదిస్తేనే తాను రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజలు కాదంటే రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో రాఘవ లారెన్స్ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో తన రాజకీయ భవిష్యత్ గురించి వివరించి చెప్పారు. తుది నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు. పొలిటికల్ ఎంట్రీపై త్వరలో ప్రకటన

మిగతా 2వ పేజీలో..

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు
- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం



## ముడిచమురు సరఫరాలో అంతరాయం

**న్యూఢిల్లీ,జూన్12 (చట్టం) న్యూస్ :** పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది. పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

- సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది
- రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు



**తిరుపతి,జూన్12 (చట్టం) న్యూస్ :** స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు

మిగతా 2వ పేజీలో..

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపపు వ్యవహారం

### బోస్టన్ కోర్టు తీర్పుపై సవాల్ చేయనున్న న్యాయశాఖ



**వాషింగ్టన్,జూన్12 :** హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గేది లేదని తేల్చారు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం

మిగతా 2వ పేజీలో..

## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

- రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది
- రాయలసీమను రాయల్ సీమగా మార్తాం
- మనది గూగుల్ అయితే..వారిది గొడ్డలి
- తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు



**తిరుపతి,జూన్12 (చట్టం) న్యూస్ :** కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి

మిగతా 2వ పేజీలో..

## ప్రజలు అధికారంతో పాటు ..అతి పెద్ద బాధ్యత అప్పగించారు

- ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ
- గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి
- రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్




**తిరుపతి,జూన్12 (చట్టం) న్యూస్ :** ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ

మిగతా 2వ పేజీలో..

## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి



**న్యూఢిల్లీ,జూన్12 (చట్టం) న్యూస్ :** పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం

మిగతా 2వ పేజీలో..

## ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

### క్రీడారంగానికి తీరని లోటని ప్రధాని సంతాపం



**న్యూఢిల్లీ,జూన్12(చట్టం) న్యూస్ :** దిగ్గజ షూటర్, ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా (49) కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన.. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భారత్ స్టార్

మిగతా 2వ పేజీలో..

# సంక్షోభం నుంచి.. సంక్షేమం దిశగా పయనం

**మొదటి పేజీ తరువాయి..**

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. 'ఐదు కోట్ల మంది ప్రజల అపార నమ్మకంతో ప్రజాప్రభుత్వం బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా రెండేళ్లు. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, సమస్యలను వదిలి వెళ్తే... అన్నింటినీ అధిగమిస్తూ సంక్షేమం – అభివృద్ధి – సుపరిపాలన అందిస్తున్నాం. అధికారాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నాం. ప్రతి పౌరుడిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతి వర్గాన్ని గెలిపించడమే అజెండాగా పని చేస్తున్నాం. వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తూ... రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం. రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్రాభివృద్ధిలో అడుగడుగునా సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి ప్రజల తరఫున ధన్యవాదాలు చెబుతున్నాను. అటు కేంద్ర ప్రభుత్వ సహకారం, ఇటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ రెండేళ్ల ప్రయాణంలో అండగా ఉన్న రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతున్నాను. రానున్న రోజుల్లో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసేందుకు ప్రజల మద్దతు, సహకారం కోరుతూ...జై ఆంధ్రప్రదేశ్!' అంటూ సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ

**మొదటి పేజీ తరువాయి..**

చేస్తానని చెప్పారు. లారెన్స్ తన పోస్టులో.. 'ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా.. మీ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించండి. ఈ వీడియో చూసిన తర్వాత, దయచేసి మీ సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్స్ రూపంలో పంచుకోండి. మీరు 'వద్దు' అని చెబితే.. నేను రాజకీయాల్లోకి రాను. సమాజానికి నా నిస్వార్థ సేవను ఇలాగే కొనసాగిస్తాను. కానీ మీరు 'అవును' అని చెబితే.. మీ అందరి ఆశీస్సులతో ఈ రాజకీయ ప్రయాణాన్ని ఎప్పుడు, ఎవరితో కలిసి ప్రారంభించాలో నిర్ణయించుకుంటాను' అని పేర్కొన్నారు.

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపవు వ్యవహారం

**మొదటి పేజీ తరువాయి..**

సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట లభించనట్లయ్యింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లేనని భావిస్తున్నారు.

## ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

**మొదటి పేజీ తరువాయి..**

షూటర్ మను బాకర్ ఈయన కోచింగ్‌లోనే రాటుదేలిన సంగతి విదితమే. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా ఇటీవల జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను దిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధృవీకరించింది. 'జర్మనీలో వరల్డ్‌కప్ సందర్భంగా జస్పాల్‌కు ఛాతినొప్పి, అసౌకర్యం కలిగాయి. ఎసిడిటీగా పొరబడి.. తన పనిలో నిమగ్నమయ్యాడు. అయితే భారత్‌కు వచ్చేటప్పుడు మళ్లీ అసౌకర్యానికి గురయ్యాడు. దాంతో ఆసుపత్రిలో చేరాడు అంటూ జస్పాల్ సోదరుడు సుభాష్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. 2006 ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలు గెలిచిన జస్పాల్.. గతంలో జాతీయ జూనియర్ కోచ్‌గా వ్యవహరించారు. అప్పుడే మను బాకర్, సౌరభ్ చౌదరి లాంటి ప్రతిభావంతులైన షూటర్లు వెలుగులోకి వచ్చారు. ఒలింపిక్స్ విజయాల అనంతరం ఆయన గత ఏడాది ఫిబ్రవరిలో జాతీయ కోచ్‌గా నియమితులయ్యారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జస్పాల్ రాణా మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరనిలోటన్నారు. షూటింగ్‌లో ఆయన సాధించిన విజయాలతో దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. యువ అథ్లెట్లను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ఎనలేనిది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబం, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## ప్రజలు అధికారంతో పాటు .. అతి పెద్ద బాధ్యత అప్పగించారు


**మొదటి పేజీ తరువాయి..**

విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికీ ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.

## కరెంటు కలెక్షన్ తొలగించాలి

### దేశాయి పల్లి గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యం లో వినతి పత్రం అందజేత

**బోయిన్ పల్లి మండలం / జూన్ 12 ,(చట్టం బ్యూరో) :** బోయిన్ పల్లి మండలం లోని దేశాయి పల్లి సర్వీసు నెంబర్ 179 యొక్క కలెక్షన్ ను తొలగించాలని దేశాయి పల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. భూ సేకరణ చట్టం ప్రకారం లబ్ధి పొందిన వ్యక్తి ఆ ప్రదేశంను వీడక అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాడని తెలిపారు. దానికి సంబంధించిన పూర్తి వివరాలను సెస్ ఏ. ఈ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.






# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

**మొదటి పేజీ తరువాయి..**

కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు



సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

# రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

**మొదటి పేజీ తరువాయి..**

ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్య్రం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.

అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్య్రాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

**మొదటి పేజీ తరువాయి..**

చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, దిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు. 2024లో రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని సీఎం విమర్శించారు. ప్రజా వేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందని అన్నారు. కేంద్ర పథకాలు, సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని మండిపడ్డారు. అప్పులు, అరాచకాలు, ఆర్థిక విధ్వంసం తప్ప జగన్ చేసిందేమీలేదని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కేసులు, జైళ్లతో చీకటి పాలన సాగించారని దుయ్యబట్టారు. అలాంటి దశలో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఏపీలో చీకటి పాలన పోయి.. ప్రజాపాలన వచ్చిందన్నారు. 21వ శతాబ్దం ప్రధాని మోదీదే అని సీఎం స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి మోదీ ఆత్మస్థైర్యం ఇచ్చారన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాలనలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్‌జెట్ తయారుకాబోతోందన్నారు. తిరుపతిలో బుల్లెట్ ఫ్యాక్టరీ వస్తోందని, రాయలసీమ ఇప్పుడు బంగారుసీమ కాబోతోందన్నారు. వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. జొన్నవాడలో బంగారం వెలికితీస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నామని తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమ ముఖచిత్రాన్ని కాపాడతామన్నారు. కల్యాణి డ్యామ్‌కు ఈ ఏడాది నీళ్లు తీసుకొస్తున్నామన్నారు. 3 రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. '3 రాజధానులు కాదు.. 3 ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఈసభలో పాల్గొన్నారు.

## నిరుపేద పేద మహిళలకు పెళ్లికి ఆర్థిక సాయం అందజేత



**బోయిన్ పల్లి మండలం / జూన్ 12 ,(చట్టం బ్యూరో) :** బోయిన్ పల్లి మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబం బొడ్డు దుర్గయ్య కుమార్తె అయిన బొడ్డు ఖుషి కి వివాహం ఈనెల 18వ తారీఖున ఉండగా వారి కుటుంబం పరిస్థితిని చూసి చలించి ప్రముఖ సామాజికవేత్త తూడి లచ్చన్న ఆధ్వర్యంలో పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తూడి లచ్చన్న మాట్లాడుతూ ఇలాంటి నిరుపేదలు ఎంతోమంది కి సహాయం చేయడమే నా యొక్క ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్లమోహన్ టివిఎల్ యువసేన సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎండి రహీం పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు



**పెగడపల్లి, జూన్ 11( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని అయితుపల్లి గ్రామంలో బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎండి రహీం,పుట్టినరోజు వేడుకలు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# ప్రాథమిక సహకార సంఘాన్ని పునః ప్రారంభించాలి

### డిసిఓ ను కలిసిన సిపిఐ నాయకులు తండా సందీప్, భానోత్ లింగ్యనాయక్

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 12,(చట్టం న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా మల్యాల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం సొసైటీ ని తక్షణమే పునః ప్రారంభించాలని డిసిఓ విజయకుమారి ని కలిసి వినతిపత్రం అందజేసిన సిపిఐ మండల కార్యదర్శి తండా సందీప్, మండల సహాయ కార్యదర్శి బానోత్ లింగ్యనాయక్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్యాల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం సొసైటీ ని పునః ప్రారంభించి అక్కడి రైతులను ఆదుకోవాలని అన్నారు. కొంత మంది దళారుల చేతిలో రైతులు మోసపోయారాని రైతులను ఆదుకోవలిసిన మరియు కాపాడుకోవలిసిన బాధ్యత సాకారసంఘం అధికారులపై ఎంతైనా ఉందని అన్నారు మల్యాల గ్రామంలో సాకారసంఘం తీసివేయడంతో అక్కడ వేలాది మంది రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే రైతులకు న్యాయం జరిగేలా చూసి సొసైటీ ని పునః ప్రారంభించాలని అన్నారు.



# కౌమార యువతలో జీవన నైపుణ్యాలను పెంపొందించాలి





### లయన్ జిల్లా గవర్నర్ కోదండరామ్ సింహరాజు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 11 ,(చట్టం బ్యూరో) :** యువభారతంలోని అతి ముఖ్యమైన విభాగం అయిన కౌమార యువతలో సరైన ఆధునిక జీవన నైపుణ్యాలు పెంపొందిస్తేనే రేపటి భారతదేశానికి సమర్థవంతమైన నాయకత్వం లభిస్తుందని లయన్ జిల్లా గవర్నర్ లయన్ సింహరాజు కోదండరామ్ అన్నారు. ఈ రోజు స్థానిక సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల(జదీూజు) ప్రాంగణంలో శాతవాహన లయన్స్ క్లబ్ నిర్వహించిన ప్రతిష్ఠాత్మక రెండు రోజుల లయన్స్ క్వెస్ట్ టీచర్ ట్రైనింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ టీన్ ఏజ్ యువత శరీరంలో వచ్చే హార్మోనల్ మార్పులకు అనుగుణంగా వారి మానసిక స్థాయిని సరైన పద్ధతిలో మార్గదర్శనం చేయడానికి లయన్స్ క్వెస్ట్ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. కౌమార యువత వ్యక్తిగత శారీరక, మానసిక, భావోద్వేగ సమతుల్యత సాధించేందుకు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాస శిక్షణ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని లయన్స్ క్వెస్ట్ శిక్షణను ఏర్పాటు చేసేతున్నామని తెలిపుతూ ఈ టీచర్ల శిక్షణ తరగతులను ప్రారంభించారు. విశిష్ట అతిథిగా హాజరైన లయన్ ఎం భద్రేశం మాట్లాడుతూ మార్కులు, ర్యాంకుల చుట్టు తిరుగుతున్న నేటి విద్యావిధానంలో పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి కృషి జరగడం లేదని తెలిపారు. మన పునాదులను నేటి టీన్స్‌కు పరిచయం చేయాల్సిన అవసరముందన్నారు. సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (జదీూజు) చైర్మన్ లయన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి నిపుణులు తయారు చేసిన అంశాలతో కూడిన శిక్షణ అవకాశాన్ని తాము సద్వినియోగం చేసుకుంటామని చెప్పారు. చైర్మన్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థి చుట్టు సహచరులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజం వలయం ఏర్పడిందని, దీని ప్రాముఖ్యతను పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన లయన్ పి.ప్రవీణ్ మాట్లాడుతూ 5 లక్షల రూపాయలు వెచ్చించి చేస్తున్న లయన్స్ క్వెస్ట్ టీచర్ల శిక్షణకు ఈ పాఠశాల అర్హత సాధించడం హర్షణీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డితో పాటు శాతవాహన లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎం.మహేందర్, జిఎల్‌టీ కోఆర్డినేటర్ ఈ.రమేష్, రీజియన్ చైర్మన్ లయన్ వి.జగదీశ్వర చారి, కార్యదర్శి లయన్ జి.చంద్ర శేఖర్, కోశాధికారి లయన్ పి.సురేందర్, లయన్ ఎన్.వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ 2-రోజుల శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రేనర్ కె.రేణుక, పాఠశాల ప్రిన్సిపల్ ప్రియదర్శిని, విజన్ స్కూల్ ఉపాధ్యాయులు ఐదుగురు, సెయింట్ జార్జ్ పాఠశాలకు చెందిన 24 టీచర్స్, 05 గురు ప్యారడైజ్ శిక్షణలో ఎంపికైన విలువైన సమయాన్ని వెచ్చించారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 18 ,(చట్టం బ్యూరో) :** పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చేగుర్తి గ్రామానికి చెందిన చామన పల్లి శ్రీనివాస్ అనునతడు తన ట్రాక్టర్ నందు మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి తన ట్రాక్టర్లో కరీంనగర్ వైపుకు తరలిస్తుండగా తీగలగుట్టపల్లి వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు మరియు కరీంనగర్ కిసాన్ నగర్ కు చెందిన వీర్ల సంపత్ అనునతడు మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి తన ట్రాక్టర్లు తరలిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని చల్మెడ ఆసుపత్రి వద్ద పోలీసులు పట్టుకున్నారు, అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితుల పై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించడం జరిగినది మరియు , ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# బూరుగు పల్లిలో నూతన మహిళా సంఘం భవనం ప్రారంభం

- నూతన భవనం ప్రారంభం చేసిన భూ స్థలదాత కుటుంబ సభ్యులు
- ఘనంగా కొలుపుల శ్రీకాంత్ జన్మదిన వేడుకలు





**బోయిన్ పల్లి మండలం / జూన్ 12 ,(చట్టం బ్యూరో) :** బోయిన్ పల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో నూతన మహిళా సంఘం భవనం ప్రారంభ కార్యక్రమాన్ని భూ స్థల దాతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కొలుపుల శ్రీకాంత్ స్మారకార్థం రెండు గుంటల భూమిని నూతన మహిళా సంఘం భవనానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ మాట్లాడుతూ గ్రామంలో మహిళలకు గతంలో పాలకవర్గం ఆధ్వర్యంలో నూతన భవన ప్రారంభాన్ని మూడు నెలల్లో అందరి సమక్షంలో చేస్తామని హామీ ఇచ్చామని ఇచ్చిన మాట విధంగా త్వరితగతిన పాలకవర్గం ఆధ్వర్యంలో నేడు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గ్రామ అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులను ఎప్పటికప్పుడు సద్వినియోగ పరుస్తూ గ్రామ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు. కొలుపుల శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా వారి ఆత్మీయ స్నేహితుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామస్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున గ్రామంలోని గ్రామస్తులు పాల్గొన్నారు. తదనంతరం కొలుపుల శ్రీకాంత్ స్నేహితుల ఆధ్వర్యంలో జన్మదినం సందర్భంగా ఘనంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయన స్నేహితులు మాట్లాడుతూ కొలుపుల శ్రీకాంత్ చిన్నతనంలో అందరితో కలిసి మెలసి ఉండేవాడని ఆయన మరణం చాలా కలిసి వేసిందని పేర్కొన్నారు. ఆయనతో గడిపిన ప్రతిక్షణం మర్చిపోలేక పోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెరుక గౌతమీ మహేష్, మ్యాన వర్షిత వెంకటేష్, అతికం రాజశేఖర్ గౌడ్, బరిగే రాధా రమేష్ , గ్రామం లోని మహిళా సంఘం సభ్యులు,కుల సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నీలోజిపల్లి గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటి కోసం చర్యలు

- సర్పంచ్ అను ముల భాస్కర్ ఆధ్వర్యంలో కొత్త వాటర్ ఫిల్టర్ల ఏర్పాటు
- ట్యాంకుల శుభ్రత కార్యక్రమం ;



**బోయిన్ పల్లి మండలం / జూన్ 12,( చట్టం బ్యూరో) :** బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.గ్రామంలోని బాలవికాస్ కేంద్రంలో కొత్త వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ ఫిల్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలుషిత నీటి వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను నివారించేందుకు శుద్ధమైన నీటి వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు.అలాగే గ్రామంలోని తాగునీటి ట్యాంకులను ప్రత్యేకంగా శుభ్రం చేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమం నిర్వహించారు. నీటి నిల్వ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సర్పంచ్ ఆధ్వర్యంలో నిరంతరం కార్యక్రమాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. బాలవికాస్ కేంద్రం ద్వారా గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసిన ఈ తాగునీటి సదుపాయంపై వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బాలవికాస్ కేంద్రం సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఈత వనం దగ్ధం



**రాయికల్ జూన్ 12 చట్టం :** రాయికల్ పట్టణంలో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దాదాపు 5 ఎకరాలలో ఉన్న ఈతవనాలు దగ్ధమయ్యాయి. రాయికల్ పట్టణ గౌడ సంఘానికి చెందిన స్థానిక ఇటిక్యాల రోడ్డులో గల శివారులోని ఈత వనానికి మంటలు చెలరేగి సుమారు 800 చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటన స్థలంలో ఉన్న గీత కార్మికులు ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేసినప్పటికీ ఆలస్యం కావడంతో చెట్లు పూర్తిగా కాలిపోయి నష్టం వాటిల్లింది. నష్టపోయిన గీత కార్మికులు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# తడగొండలో 30 ఏళ్ల సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికుడు దుర్గయ్య ను సన్మానించి న బుర్ర కనకయ్య ;



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 12,( చట్టం బ్యూరో) :** తడగొండ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా గత 30 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన కట్ట దుర్గయ్యను అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుర్ర కనకయ్య ఘనంగా సన్మానించారు.
గ్రామానికి ఎనలేని సేవలు అందించిన దుర్గయ్య కి బుర్ర కనకయ్య ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి చిరు సన్మానం నిర్వహించారు. మూడు దశాబ్దాల పాటు గ్రామ పరిశుభ్రత కోసం అంకితభావంతో పనిచేసిన దుర్గయ్య సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.
మంచి మనసుతో దుర్గయ్య ను సన్మానించిన బుర్ర కనకయ్య ని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గయ్య కి శుభాకాంక్షలు తెలిపారు.

# ట్యాంకు బండిపై సినారే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

### రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 12 ,(చట్టం బ్యూరో ) :** తెలంగాణముద్దుబిడ్డ ప్రఖ్యాత సాహిత్య వేత్త, ప్రముఖ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణ రెడ్డి విగ్రహాన్ని ట్యాంక్ బండి పైన ఏర్పాటు చేయవలసిందిగా రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ లో సంది తిరుపతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి చెందిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి నారాయణ రెడ్డి సినీ రంగంలో సాహిత్య రంగంలో విశేష ప్రతిభ కనబరిచారని ఆయన సేవలకు గుర్తింపుగా హుస్సేన్ సాగర్ ట్యాంక్ బండి పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు ఆయన ప్రతిభ తెలిసేలా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. వారి యొక్క వర్ధంతి జూన్ 12 న ఉన్నందున, ఈ సందర్భంగా పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సంది తిరుపతిరెడ్డి కోరారు. ఇతర ప్రాంతాల వారికి విగ్రహాలను కూడా రాఖీ పండుగ ఏర్పడి చేశారని మన తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ సాహిత్య సినారే విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తే తెలంగాణ ను గౌరవించుకున్నట్లు ఉంటుందన్నారు. ఆయన జయంతి వరకు విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేయాలని సంది తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. రెడీ ఐక్యవేదిక ప్రతినిధులు కాంతాల సత్యనారాయణ రెడ్డి, జాలి శ్రీనివాస్ రెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, కర్ర అశోక్ రెడ్డి, జలపతి రెడ్డి కంది శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఏడాదిగా జీవచ్ఛవంలా బతుకతున్నాను

### ఎయిరిండియా ప్రమాదంలో బయటపడ్డ విశ్వాస్

**న్యూఢిల్లీ,జూన్12 :** దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఎయిరిండియా ప్రమాద ఘటన జరిగిన నేటికి ఏడాది అయ్యింది. ఆ దుర్ఘటన నుంచి బయటపడిన ఒక్కే ఒక్కడు విశ్వాస్ కుమార్ రమేశ్ . ఏడాది గడిచిపోయినా.. ఆయన ఈ విషాదాన్ని మర్చిపోలేకపోతున్నారు. అలాగే బాధిత కుటుంబాల మనసుల్లోని ప్రశ్నలకు సమాధానాలు కావాలని అడుగుతున్నారు. నేను బతికి బయటపడినదే ప్రజలకు కనిపిస్తుంది. కానీ నాలుగు గోడల మధ్య నేను ఎదుర్కొంటున్న సవాళ్లు ఎవరికీ అర్థం కావు. ఇప్పటికీ నేను నిద్రలేమి, ఆందోళన, చేదు జ్ఞాపకాలతో పోరాడుతున్నాను. ఒక సంవత్సరం గడిచిపోయింది. బతికి ఉన్నందుకు కృతజ్ఞుడినే. కానీ అప్పటినుంచి నేను చేస్తోన్న పోరాటాన్ని మాత్రం మాటల్లో వర్ణించలేను. నా జీవితాన్ని పునర్నిర్మించుకుంటూ కుటుంబంతో కలిసి ముందుకు సాగుతున్నాను అని జాతీయమీడియాతో మాట్లాడారు. ఈ బాధ తన ఒక్కడిదే కాదని, ప్రభావిత కుటుంబాలు కూడా ఇదేరకమైన వేదనను అనుభవిస్తున్నాయని విశ్వాస్ చెప్పారు. జరిగిన దానిని ఎవరూ మార్చలేరు కానీ.. ప్రజలకు నిజాయతీ, వారు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు కావాలన్నారు. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ ఒక్కడే బయటపడ్డారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్.. గుజరాత్‌లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ రోజు విమానంలో 11-ఏ సీటులో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ఆ సీటు విరిగిపడిపోవడంతో ఆయనకు మంటలు అంటుకోలేదు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కిన దృశ్యాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో తన సోదరుడు అజయ్‌ను కోల్పోయారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. కాగా.. దుర్ఘటనకు సంబంధించిన తుది రిపోర్ట్ రావడానికి ఇంకా రెండు నెలలు పట్టొచ్చని తెలుస్తోంది.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని సన్మానించిన గౌడ గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్ ;



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 12,( చట్టం బ్యూరో) :** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన గౌడ బాంధవుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ గౌండ్ల ఆడబిడ్డ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి గౌడ నిత్యాన్నధాన సత్రం కొండగట్టు ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ కోల రాజేశం గౌడ్ లు శుక్రవారం బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను శాలువాతో సత్కరించి గౌడ నిత్యాన్నధాన సత్రం జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్బంగా మంద వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్థులు రాజకీయంగా ఎదగాలని అన్ని రంగాలలో ముందుండి గౌడ జాతిని అభివృద్ధి దిశగా తీసుకొని వెళ్ళాలని అన్నారు. రాజకీయ పార్టీలు ఏవైనా కాని గౌడ కులస్థులు ఐక్యంగా ఉండి గౌడ కులస్థుల సమస్యలపై పోరాడాలని కోరారు.మా గౌడ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా నియామకం చేసిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం అందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కొండగట్టు గౌడ నిత్యాన్నధాన సత్రం అభివృద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు..

# బడిలోనే ..దేశ భవిష్యత్‌కు పునాది !

విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్దికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ది చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే... స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే

రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్దం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

## తాడిపత్రిలో మరోమారు ఉద్రిక్తత

**కేతిరెడ్డి ఇంటిముందు ఆందోళనకు జెసి సిద్దం**

**ఇరువర్గాల పరస్పర బాహీతో రంగంలోకి దిగిన పోలీసులు**

అనంతపురం,జూన్12 : తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ ఆందోళనలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపుమేరకు కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన కార్యక్రమాన్ని మొదటగా పోలీసులు అడ్డుకున్నారు. పెద్దారెడ్డిని అరెస్ట్ చేసి అనంతపురంకు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు, వైసీపీ శ్రేణులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అక్కడ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సమయంలో జేసీ ప్రభాకర్ రెడ్డిని ఉద్దేశించి పెద్దారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై జేసీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వెంటనే పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలంటూ జేసీ ఆందోళనకు దిగారు. అనుచరులతో కలిసి కేతిరెడ్డి ఇంటి వద్దకు వెళ్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో.. ఆయన అక్కడే బైఠాయించి ఆందోళకు దిగారు.తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనుచిత వ్యాఖ్యలపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దారెడ్డి ఇంటి ఎదుట ఆందోళనకు జేసీ సిద్ధమయ్యారు. అనుచరులతో కలిసి వెళ్తున్న మున్సిపల్ చైర్మన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించి జేసీ నిరసనకు దిగారు. ఫ్యాక్షన్ చేస్తానంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి రానిచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పెద్దారెడ్డికి పోలీసులు భద్రత కల్పించడంపై ఆయన మండిపడ్డారు. పెద్దారెడ్డిపై ఫిర్యాదు చేసేందుకు పట్టణ పోలీస్ స్టేషన్‌కు అనుచరులతో కలిసి జేసీ ప్రభాకర్ రెడ్డి వెళ్లారు.

## మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

**నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత**

**ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన**

న్యూఢిల్లీ,జూన్12 : రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల పక్రియ కొనసాగుతున్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల పక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

# యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

**పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి**

**అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి**



హైదరాబాద్,జూన్12 ): సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

----

# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

**షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు**



హైదరాబాద్,జూన్12 తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్‌ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

------

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

**నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు**

**హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన**

సిద్ధిపేట,జూన్12 : సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

**ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం**

**కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు**

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం**

కరీంనగర్,జూన్12 : రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్ ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించక పోవడంతో ఆ పథకం నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా కూడా రావడం లేదు. ఎరువులకూ ఇబ్బందులు తప్పడం లేదు. వడ్లు, మక్కలు విక్రయానికి రైతులు పడిగాపులు కాశారు. సంచులు చెదలు పట్టినా వడ్లు కొనే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత కరెంటూ పోయింది. కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారు. రైతులు ఆ పార్టీకి ఓటేసే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున పింఛను ఇవ్వడం లేదు. ప్రభుత్వ సొమ్ము రూ.100 కోట్లతో సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ సోకులకు నిధులు ఉంటాయి కానీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రైతుబీమాకు ఉండవా? రైతులకు డబ్బు ఇచ్చేందుకు రేవంత్‌కు మనసు రావడం లేదు. ఆయనకు అధికారం మత్తెక్కింది. హిట్లర్ పాలనను అంతం చేయడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.

------

## గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహణ..

**నార్పల జూన్ 12, (చట్టం) న్యూస్ :** నార్పల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2026బి27 పై ఎంపిడిఓ కార్యాలయం లో ఎంపీడీవో మమతా దేవి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీల ప్రత్యేక అధికారులకు, కార్యదర్శులు, వెలుగు వి ఏ లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల, డిజిటల్ అసిస్టెంట్ లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి మండల విద్యాధికారులు కృష్ణయ్య నారపరెడ్డి ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ జనార్ధన్ డిప్యూటీ ఎంపీడీవోలు శ్యామల, సుజాత, , వ్యవసాయాధికారి చన్న వీరాస్వామి, ఎంపీడీవోకార్యాలయ పర్యవేక్షకులు మోపూరీ శేషారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుబహాన్ మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు..

## జయశంకర్ బడిబాటలో బోధకులు





**కొడిమ్యాల, జూన్ 12(చట్టం) :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొడిమ్యాల పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని గ్రామంలో బడీడు విద్యార్థుల తల్లిదండ్రులను కలవడం జరిగింది. వారికి పాఠశాల బడిబాట కరపత్రం అందజేసి పాఠశాలలోని పలు అంశాలను వివరించి వారి పిల్లలను కొడిమ్యాల హైస్కూల్ కు పంపించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## హనీట్రాప్‌లో మోసపోయిన మహిళా న్యాయమూర్తి

**పనివాళ్లతో ఫిర్యాదుతో బయటపడ్డ వైనం**

**చండీఘడ్,జూన్12 :** హనీట్రాప్ లో పడి.. ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు.

# "ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి?"





**సూపర్ సిక్స్ కాదు... సూపర్ హిట్ మోసాలు". మాజీ మంత్రివర్యులు డాక్టర్ సాకే శైలజ నాథ్,**

**నార్పల జూన్ 12, (చట్టం) న్యూస్ :** చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, ప్రజలకు ఇచ్చిన హామీలు, చేసిన మోసాల ను ఎండగడుతూ సింగనమల నియోజకవర్గం లో సమన్వయకర్త, మాజీ మంత్రివర్యులు, డాక్టర్ సాకే శైలజనాథ్ గారి అధ్యక్షతన భారీ ర్యాలీ నిర్వహించారు. సింగనమల కేంద్రంలో దర్గా సెంటర్ నుంచి రామస్వామి గుడి సమీపము వరకు నాయకులు అభిమానులు కార్యకర్తల నినాదాలు, నిరసనల మధ్య ర్యాలీ కొనసాగించారు.

ర్యాలీ బస్టాండ్ సమీపానికి చేరుకోగానే సూపర్ సిక్స్ పథకాలతో కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిన ప్రజలను మోసం చేసినందుకు నిరసనగా ఒక్కొక్క హామీకి ఒక్కొక్క నల్లటి బెలూన్ పగలగొట్టి నిరసన తెలియజేశారు.

అనంతరం డాక్టర్ సాకే శైలజనాథ్ గారు మాట్లాడుతూ...

ఈ రెండు సంవత్సరాల పాలనను చూసిన తర్వాత రాష్ట్ర ప్రజలు ఒక్క మాట చెబుతున్నారు -- "ఇది అభివృద్ధి పాలన కాదు... చంద్రబాబు వెన్నుపోటు పాలన!" అని అంటున్నారు.

ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట చెప్పడం చంద్రబాబుకు కొత్త కాదు. కానీ ఈసారి ఆయన వెన్నుపోటు కేవలం రాజకీయ ప్రత్యర్థులకు కాదు... రైతులకు, మహిళలకు, యువతకు, వృద్ధులకు, పేదలకు, రాష్ట్ర ప్రజలందరికీ జరిగింది.

రైతు బిడ్డనని చెప్పుకునే చంద్రబాబు, రైతు కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టారు. రైతులకు కూటమి ప్రభుత్వంలోనే మంచి జరిగిందనీ గొప్పలు చెప్పుకుంటున్నారు. పంటకు గిట్టుబాటు ధర లేదు, సాగునీటి హామీలు నెరవేరలేదు, రైతు సంక్షేమంపై నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది.

రైతే రాజు అనే చెప్పుకొనే స్థాయి నుంచి రైతు దిక్కుతోచని స్థితికి తీసుకొచ్చిన ఘనత ఈ కూటమి ప్రభుత్వానిది. నియోజకవర్గంలో నీళ్లు లేక చెట్లెందుతున్నాయి, అప్పుల బాధతో రైతులు తనువు చాలిస్తున్నారు, కానీ ఇంతవరకు ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకున్న దాఖలాలు లేవు.

రైతు చెమటకు విలువ ఇవ్వని ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకోవడం సిగ్గుచేటు.

ఎన్నికల ముందు ఒక మేనిఫెస్టో... అధికారంలోకి వచ్చిన తర్వాత మరో పాలన. ఇది ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు కాదా? హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబు గారి గొంతు పెద్దగా వినిపించింది... కానీ వాటిని అమలు చేయమంటే ఇప్పుడు ఆ గొంతు మూగబోయింది.

"చంద్రబాబు గారి రాజకీయ జీవితంలో వెన్నుపోటు ఒక చరిత్ర అయితే, ఈ రెండేళ్ల పాలనలో అది ప్రభుత్వ విధానంగా మారింది."

"ప్రజలు అభివృద్ధి కోసం ఓటు వేస్తే, ఈ ప్రభుత్వం ప్రచారం కోసం పనిచేస్తోంది. ప్రజా సమస్యలను పక్కన పెట్టి రాజకీయ కక్ష సాధింపుకే ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షంపై దాడులు చేయడంలోనే సమయం గడుపుతోంది."

"గ్రామాల్లో తాగునీటి సమస్యలు, రైతులకు సాగునీటి ఇబ్బందులు, నిరుద్యోగ యువత ఆవేదన, పెరుగుతున్న ధరలు ఇవే కూటమి పాలనకు నిదర్శనం. ఈ రెండేళ్లలో ప్రజలకు అర్థమైన ఒకే విషయం ఏమిటంటే... కూటమి ప్రభుత్వం చెప్పిందేది గ్యారంటీ కాదు, మోసమే గ్యారంటీ."

మీరిన్ని రాజకీయ విన్యాసాలు చేసిన లోకల్ బాడీ ఎలక్షన్స్ లో ఎగిరేది వైఎస్ఆర్సిపి జెండా అది కూడా సింగనమల గడ్డ నుంచే మొదలవుతుంది అనే విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ఎవరు ఎన్ని బెదిరించిన, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ, మీరు చేసే ప్రతి అఘాయిత్యానికి ఎదురుకోవడానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నాను. అని అన్నారు

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి గార్లదిన్నె నారాయణరెడ్డి, భోగాతి నారాయణరెడ్డి, వంశీ గోకుల రెడ్డి, బొమ్మన శ్రీరామ్ రెడ్డి, బండ్లపల్లి ప్రతాపరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పరంధామ రెడ్డి, ఎల్లారెడ్డి, గువ్వల శ్రీకాంత్ రెడ్డి, ఖాదర్ వలీ, మహేశ్వర్ రెడ్డి, శివశంకర్. కల్లూరు సూర్యనారాయణ, జమాల్ వలి, శ్రీనివాస్ నాయక్, లలిత కళ్యాణి, పద్మావతి, నాగరత్నమ్మ, ఎన్ వి నారాయణ, భాస్కర్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు నార్పల ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్ బచ్చలన్న, మడుగుపల్లి సుధాకర్ రెడ్డి, కాటమయ్య, మంత్రి ఆంజనేయులు, శ్యాంసుందర్ రెడ్డి, పనింద్ర, శ్రీనివాసరెడ్డి, భయపరెడ్డి, ఓబిరెడ్డి, గుడ్డుమరి ఈశ్వర్ రెడ్డి, ముకుందాపురం గంగాధర్, నూర్ మహమ్మద్, ఆదినారాయణ, కొండ్రెడ్డి భాస్కర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రవికుమార్, నాగేశ్వరరావు మరియు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





## మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**కొడిమ్యాల, జూన్ 12(చట్టం) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో 6 నుండి 10 తరగతుల్లో ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.లావణ్య తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయం, ఫోటోలను తీసుకువచ్చి ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన వసతి, డిజిటల్ పాఠాల ద్వారా బోధన అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్షిప్ కూడా అందుతుందని తెలిపారు. మండల పరిధిలోని విద్యార్థులు ఈ చక్కని అవకాశం వినియోగించుకోవాలని, వివరాలకు మోడల్ స్కూల్ లో సంప్రదించాలని తెలిపారు.



95814 19999
చట్టం సాహితీ లోకం

## ఒత్తిడిని తగ్గించే బ్రహ్మాస్త్రం యోగాస్త్రం

(జూన్21 అంతర్జాతీయ
యోగా దినోత్సవం
సందర్భంగా రాసిన కవిత)

ఉరుకుల పరుగుల జీవితంలో
అలసిపోతున్న మనసు కోసం
ఒత్తిడిని దూరం చేసే అస్త్రం
మన ప్రాచీన యోగాస్త్రం

జూన్ 21వ తేదీన ప్రపంచ
మంతా జరుపుకునే పండుగ
జాతి మత ప్రాంతం భేదం
లేనిది ఈ అంతర్జాతీయ
యోగా దినోత్సవం

ఒత్తిడిని ఆందోళనలను తగ్గించే
దివ్యమైన బ్రహ్మాస్త్రం యోగాస్త్రం
చిరునవ్వును మరవని మనిషి
జీవితంలో తెలియని అలసట
నింపే ఈ హైటెక్ కాలంలో
సమస్యల సుడిగుండంలో చిక్కిన
మనసుకు యోగాసనమే కదా
ఒక దివ్యమైన ప్రకృతి చికిత్స
సమస్త రోగాలను హరించే
దివ్యాస్త్రం ఈయోగాస్త్రం

అలసిన మదికి అమృతం యోగ
కలతనుతీర్చే దివ్య ఔషధం యోగ
ఆలోచనల సుడిగుండంలో చిక్కిన
మనసుకు స్వాంతతను ఇస్తుంది

నిత్యం చేసే యోగా ధ్యానం
వల్ల శ్వాసపై నియంత్రణ పెరిగి
ప్రాణాయామంతో రోగనిరోధకత
పెరిగి ఆరోగ్యానికి రక్షణ కవచమై
నిలుస్తుంది

శ్వాసపై ధ్యాస నిలిపి చూడు
తరిమి కొడుతుంది నీలోని
నైరాశ్యపు వేదనలను
ఆసనాల మేళవింపుతో
శరీరత ధారుఢ్యత పెరిగి
ప్రాణాయామ శక్తితో
అంతరంగం వెలిగిపోతుంది
ఒత్తిడి తీవ్రత తగ్గుతుంది

సమాజం వల్ల కలిగే
ఒత్తిడిలు తట్టుకొని
నీలో దాగి ఉన్న అనంత శక్తిని
మేల్కొలిపి మనోనిబ్బరాన్ని
ఇచ్చే ఏకైక సాధనం యోగ

యోగతో మనసులోని
కల్మషాలు మాయమవుతాయి
ఇమ్యూనిటీ స్థాయి పెరిగి
అయుఃప్రమాణం పెరుగుతుంది

కఠినమైన ఆసనాల
సాధనతో శారీరక ద్రుడత్వం
సొంతమవుతుంది
ఆసనాల సాధనతో
శరీరంపై నవయవ్వనం
తొణికిసలాడుతుంది

ధ్యాన ముద్రలతో మనసు
ప్రశాంతతను పొంది నూతన
ఆలోచనలను సృజనాత్మకతను
ఆవిష్కరిస్తుంది

జీవన సాఫల్యతకు
సంతృప్తి కర జీవనానికి
యోగయే ఉత్తమమార్గం

ఆలోచనల అలజడిని
అణిచివేసే బ్రహ్మాస్త్రం యోగాస్త్రం
అంతర్గత ప్రశాంతతను
చేకూర్చే సాధనం యోగాస్త్రం

యోగ సాధన జీవనశైలిలో
భాగం చేసుకోవాలి
రోజు ఉదయం లేవగానే
యోగాకు కొద్దినిమిషాలు
కేటాయిస్తే శరీరానికి వస్తుంది
కొత్త బలం మనసుకు
దొరుకుతుంది ప్రశాంతత

ప్రతిరోజు ఉత్సాహంతో
యోగ సాధన చేస్తే
నూతన ఉషోదయం
మొదలవుతుంది
రోజంతా ఉల్లాసం
ఉరకలు వేస్తుంది

నిత్యజీవితంలో
యోగను భాగం చేసుకుంటే
ఒత్తిడి దూరమై ఆరోగ్యం
మన సొంతమవుతుంది
యోగకు కులం లేదు
మతం లేదు సరిహద్దుల
గీతల్లేవు
యోగాసనం సాధనలో
అందరూ ఒకటే
విశ్వ వేదికపై భారతావని
చాటిన యోగా విజ్ఞాన
ఆరోగ్య జెండా ఎగిరేద్దాం
మానవాళికి అందించిన
ఆరోగ్య వరప్రసాదమైన
యోగాతో
ప్రపంచాన్ని ఏకం చేద్దాం

శ్వాసపై మనం ధ్యాస పెడితే
కోపతాపాలు తగ్గిపోతాయి
ఆసనాలు క్రమంగా వేస్తే
రోగాలు దరిచేరవు

డబ్బులు ఖర్చు లేని మందు
నిత్యం చేసే యోగా సాధన
ఒత్తిడిని గెలిచే బ్రహ్మాస్త్రం
మనందరి ఆరోగ్యానికి
ఆయుధం యోగాస్త్రం

తనువును మనసును ప్రకృతితో
ముడివేసే బంధం యోగం
యోగ సాధనతో ఆందోళన
రహిత సమాజ స్థాపనకు
పాటుపడుదాం
యోగా చేద్దాం రోగాలను
తరుముదాం
ఆరోగ్య భారత్ ను ఆవిష్కరిద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సలహాదారులు
అత్తాపూర్ యోగ సెంటర్
హైదరాబాద్
9440245771



# ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గ్రహణ శక్తి రెట్టింపు




**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం జూన్ 12 చట్టం ప్రతినిధి :** పెరుగుచున్న ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అంధ విద్యార్థినీ విద్యార్థులలో గ్రహణ శక్తి రెట్టింపు అవ్వడమే కాక విషయాలను సులభంగా గుర్తుంచుకో గలుగుతారని ఆగిరిపల్లి మండల విద్యాశాఖాధికారి ఎస్. హేబేల్ అన్నారు. మండలం లోని తోటపల్లి లో గల హీల్ పారడైజ్ ఆంధపాఠశాలలో ఆరుగురు అంధ విద్యార్థులకు మిత్రజ్యోతి ఫౌండేషన్ (బెంగళూరు) సహకారంతో బుక్ షేర్.కామ్ సంస్థ సమకూర్చిన 6లాప్టాప్ లను ఆయన చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భముగా హీల్ సిఈఓ కూరపాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ, హీల్ అంధ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, కనీసం నలభై శాతం నుండి పూర్తి ఆంధత్వం వున్న వారు కూడా అంధ పాఠశాల లో చేరుటకు అర్హులే అన్నారు. అంధ బాలబాలికలకు వేరు వేరు వసతి, భోజనసదుపాయాలతో పాటు వారికి సాధారణ విద్య, బ్రెయిలి లిపి, సంగీతంతో పాటు కంప్యూటర్ విద్యను పూర్తి ఉచితముగా అందిస్తామన్నారు. అర్హత గలవారు 9100024438, 9398388612 నెంబర్లను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో హీల్ ప్రిన్సిపాల్ కవిత, వైస్ ప్రిన్సిపాల్ హరీష్, సిఆర్ పి రామారావు, అంధ పాఠశాల ఇంచార్జ్ కె. అబ్రహం తదితరులు పాల్గొన్నారు

## సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ఇట్లు పంపిణి

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం జూన్ 12 చట్టం ప్రతినిధి :** జడ్పీహెచ్ఎస్ ఆగిరిపల్లి నందు ఆగిరిపల్లి మండలం ఎంఈఓ 2 గారైన శ్రీ కె ఆనంద్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత ఇంచార్జి నవీ లక్ష్మీ గారి ఆధ్వర్యంలో ఎస్ ఆర్ కె వి ఎం కిట్టు (సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర) తల్లిదండ్రుల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సమక్షంలో విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ విద్యార్థి మిత్ర కిట్టు సుమారు 2279 రూపాయలు విలువ ఉంటుందని, ఇందులో విద్యార్థిని విద్యార్థులకు మూడు జతల యూనిఫాంలు ఉంటాయని, అదికాక స్కూల్ బ్యాగ్, స్టేషనరీ బుక్స్ ,ఒక జత బూట్లు,రెండుజాతల సాక్సులు మరియు నిఘంటువులు ఉంటాయని ప్రధానోపాధ్యాయిని పులి పుష్పలత అన్నారు .రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వీటితో ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు వీటిని వినియోగించుకుని ఉజ్వల భవిష్యత్తు పొందాలని అన్నారు.



## ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



**కొడిమ్యాల, జూన్ 12 (చట్టం) :** మనబడి..మన బాధ్యత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)రాష్ట్ర అదనపు కార్యదర్శి వీరమల్ల వెంకట రమణారావు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 ఏళ్ల పరిపాలన, సేవాస్ఫూర్తితో మన ప్రభుత్వ పాఠశాలల భవితను మార్చేలా, పాఠశాలలను పరిశుభ్రం చేయడానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తలపెట్టిన మనబడి..మన బాధ్యత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సంఘాలకు అతీతంగా, స్వచ్ఛందంగా రేపటి నుండి ఏదో ఒక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పరిసరాలను శుభ్రం చేయాలని వీరమల్ల వెంకట రమణారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు ఏనుగు ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజగంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

### ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

న్యూఢిల్లీ,జూన్12 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి దిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## తేనెటీగ (రుబాయిలు)



కష్టపడుతు రోజంతా ఎగురుతుంది తేనెటీగ.
ఇష్టముగను పూవులన్ని తిరుగుతుంది, తేనెటీగ.
తెచ్చినట్టి తేనెనంత , తేనెపట్టు లోన దాచి
భవిత కొరకు భద్రముగా ఉంచుతుంది, తేనెటీగ.

పని విభజన చేసుకుంటు కష్టపడును, తేనెటీగ.
కష్టమునే తానెపుడూ ఇష్టపడును, తేనెటీగ.
ఎవరి పనులు వారివంటు సర్దుబాటు చేసుకొంటు,
జీవితాన్ని గడుపుతూ మెచ్చబడును, తేనెటీగ.

పూవులోన మకరందము పీల్చుకుంటు కష్టజీవి.
తేనెగాను తాను పొదుపు చేసుకుంటు కష్టజీవి.
కష్టమునే కొల్లగొట్టి మనుజులంత తీసుకొనగ,
కష్టముపై నమ్మకాన్ని ఉంచుకుంటు కష్టజీవి.

శ్రమ జీవన పథములోన మానవులకు మార్గదర్శి.
పని విభజన క్రమములోన కార్మికులకు మార్గదర్శి.
త్యాగజీవి తేనెటీగ సంతసాన్ని తీపిగాను
పంచుకొనుచు, ధరణిలోన శ్రామికులకు మార్గదర్శి.

రోజంతా కష్టపడిన తరిగిపోదు, తన సత్తువ.
విసుగు లేక తిరిగిననూ కరిగిపోదు, తన సత్తువ.
మరల మరల తేనెతుట్టె కొల్లగొట్టి మనుజులెంత,
దోచిననూ విసుగు తోడ తొలగిపోదు, తన సత్తువ.

పేరు: ముక్కా సత్యనారాయణ
ఊరు: పెనుగంచిప్రోలు

చట్టం సాహితీ లోకం 95814 19999

## కర్తవ్య పథం



అడుగు ముందుకు వెయ్యి ఓ నేస్తమా,
ఆగిపోకుండా ఎక్కడా నువ్వు ఒంటరిగా.

కాలం కలకాలం నీకై నిలవదు,
కదిలే క్షణమే నీకు గమ్యం చూపును.

?కష్టాల కడలిని ఈదక తప్పదు,
కన్నీటి వెనుకనే విజయం ఉన్నదని గ్రహించు.

భయం అనే నీడను వదిలి సాగిపో,
ఆత్మవిశ్వాసమే నీ ఆయుధంగా మలచుకో.

?సోమరితనం వద్దు స్వార్థం అసలే వద్దు,
సాధించాలనే సంకల్పాన్ని అసలే వీడ వద్దు.

నేటి నీ శ్రమే రేపటి నీ గెలుపు,
సమాజ హితమగును నీ ప్రతీ అడుగు.

అడ్డంకులు ఎన్నైనా ఎదురుకానీ,
నీ ఆశయ దీప్తిని ఆపలేవు ఏవి.

ధర్మమే నీకు దారి, సత్యమే నీకు తోడు,
న్యాయం వైపు నిలబడి పోరాటం చేయు.

?కర్తవ్య పథంలో అలసట ఉండదు,
నిరంతర పయనమే ప్రగతి బాటైనప్పుడు.

దేశ ప్రగతికి నీ వంతు సాయమందిస్తూ
చరిత్ర పుటల్లో నీ సంతకం లిఖించు!

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా

చట్టం సాహితీ లోకం 95814 19999

## దైవాన్ని నమ్మండి దైవ ఉపదేశాన్ని



ప్రతి ఒక్కరూ
తప్పక ఆచరించండి

దైవం ఒకటుందని
ఆ దైవాన్ని పూజిస్తూ

దైవ ఆజ్ఞలు పాటిస్తూ
ముందుకు సాగండి

అని అంటారు రచయిత
షేక్ కాజా వలి గారు

ఏ మతం చెప్పినా
మంచి నే చెబుతుంది

మతం మనసుకు సంబంధించింది

మతం మనిషి వ్యక్తిగతం
ఆచరించటం మీ ఇష్టం

ఖురాన్, హిందూ క్రైస్తవ
మతాలు ఎన్ని చెప్పినా

మంచినే బోధిస్తాయి
మార్గం మీదే నంటుంది

మనిషిని సన్మార్గంలో
నడవమంటుంది మతం

రచయిత షేక్ ఖాజావలి
దైవ ఉపదేశాలను

మనుషులు ఆచరిస్తే
సత్ప్రవర్తంతో ఉంటారు

అంటారు ఈ పుస్తక రచయితఖాజావలి గారు

ప్రతి మనిషిలో మార్పు
తప్పక వస్తుందంటారు

దైవఉపదేశాన్ని చదివి
సన్మార్గంలో నడవండి
అంటారరచయితగారు

.................................

రచన సోఫాట్ ప్రభాకర్
బ్రాహ్మణకోడూరు గ్రామం

చట్టం సాహితీ లోకం 95814 19999

## నైతికత ఆవశ్యకత!

( పంచపదుల ప్రక్రియలో )



నేటి సమాజంలో నైతికత కొరవడుతోంది
మనిషి మనిషిలో స్వార్థం పెరిగిపోతోంది
ఆర్థిక నేరాలు సంఖ్య అధికమైపోతోంది
హింసాయుత ప్రవర్తనకు కారణమవుతోంది
నైతిక విలువలు లేని సమాజం ప్రమాదం శ్రీవరా!

వ్యవస్థలో నైతికత అనేది ఉండాలి
నడిచే దారిలో అది వెలుగై నిలవాలి
నిజాయితీని నిలబెట్టే ఓ శక్తి కావాలి
సమాజానికి అది భద్రత అందించాలి
నైతికత అనేది సమాజానికి అవసరం శ్రీవరా!

పదవులు పెరిగినా మరిచిపోరాదు
సంపదలు వచ్చినా విడిచిపెట్టరాదు
పరుల హక్కులను భంగపరచరాదు
ధర్మమనే దారిని వదిలి మెలగరాదు
నైతికత అనేది అందరిలో ఉండాలి శ్రీవరా!

దేశ ప్రగతికి మంచిబాటలు పడాలన్నా
అన్యాయం, అక్రమాలు అరికట్టాలన్నా
ప్రతీ కార్యం బాధ్యతగా నెరవేరాలన్నా
ప్రజల విశ్వాసం ప్రభుత్వం పొందాలన్నా
నైతికత అనేది అన్నింటిలో అవసరం శ్రీవరా!

నైతికత అనేది బాల్యంలో నేర్చుకోవాలి
తల్లిదండ్రులనుండి చక్కగా అలవడాలి
మాటల్లో, చేతల్లో మంచితనం ఉండాలి
మానవత్వ భావనతో తప్పక మెలగాలి
నైతిక విలువలే నిజమైన ఆభరణం శ్రీవరా!

ఈ.వి.వి.ఎస్. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ

చట్టం సాహితీ లోకం 95814 19999

## వారాలు-దైవములు



గురుగ్రహ సంబంధము గురువారము జ్ఞానము
హరిపూజ దత్తాత్రేయారాధన శుభకరము

పసుపు రంగు వస్త్రాలు పచ్చపూలతో పూజలు
ఈశనము సౌఖ్య మాధ్యాత్మికతలు శ్రేయము

మంగళదేవతకు ప్రియం మహాలక్ష్మీకంకితం
మంగళదాయకము పునీతం శుక్రవారము

శ్రద్ధాభక్తులతో తామర పూలు సమర్పించి
శుద్ధఘృత దీపము వెలిగించిన సూనృతము

సుఖైశ్వర్య సౌందర్యం శుక్రగాము సూచించు
అఖిలానందశ్రీలు సిరి నారాధించ శుభము

శనిదేవుని వారము శనిప్రభావ ఉపశమనం
నూనెదీప జ్వలనము తిలాతైల మర్పణము

మినపప్పు దుప్పట్లు నల్లతిలల దానము

దానధర్మములు కర్మఫలాలకు శమనము

భక్తిప్రార్థనము మనసుకు ధైర్య మాత్మవిశ్వాసం
శక్తి శంకరాధ్యాత్మిక భావ నాలోచనము

పేరు::శంకర్ జీ డబ్బీకార్
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

--------

చట్టం సాహితీ లోకం 95814 19999




## జీవనయానం,,,,,,,!

ఈ ఆనంతకోటి విశ్వం సృజియించిన గీతానివి నీవు
జీవితంలో అలసి సొలసి వడలిపోయిన శరీరాన్ని మోస్తో,,,,,,,
పాలిపోయిన మసక మబ్బుల గుహ నీ జ్ఞాపకాల దొంతరల మనఃఫలకం,,,,,,,,
రివ్వున ఎగిరే గబ్బిలాలు విషాద ప్రాశ్చాత్య సంగీతంలా రొదపెడుతున్నాయ్,,,,,,,,,
అనుబంధాలు ఆప్యాయతలు క్షణక్షణం తుమ్మచెట్టు ముళ్ళు గుచ్చుకుంటున్నట్లు మనస్సు నిప్పుల కుంపటి,,,,,,,,,,
ఈ సువిశాల విశ్వం నిన్ను రా రమ్మంటూ చేతులు చాస్తోంది మానవ ధూళికి పొగబారి రంగు వెలిసిన గగనం అంచుల దాకా,,,,,,,,
జీవిత అనుభవాలు కనుపాపల్లో సుడులు సుడులుగా తిరుగుతూ మనస్సు పొద నిండా నల్ల గులాబీలు విచ్చుకున్నాయ్,,,,,,,
ఈ జీవిత చరమాంకంలో ఏదో తెలియని దిగులు దిగాలుగా ఈ బ్రతుకుపై ఏదో తెలీని ప్రీతి,,,,,,,,
స్మశాన వైరాగ్యంలో మనస్సు కొట్టుమిట్టాడుతూ మోడ్రన్ చిత్రకారుడు ఆఖరి క్షణాలలో చిత్రించినట్లు మనస్సు పొరల్లో దాగున్న రహస్యాలు సుందర నదీ తీరాలు నిఘోడ స్వప్నాలు సుషుప్తిలోకి జారుకుంటుంటుంటే ఊతకర్ర ఆసరాతో దారివెంట నడుస్తూ వెళుతున్న జీవనయానం,,,,,,,,!!

అపరాజిత్
సూర్యాపేట

-----



చట్టం సాహితీ లోకం 95814 19999

## జీవితమనే ప్రయాణం



ఒక్కటే జీవితం,
ఒక్క క్షణం కూడా తిరిగి రాని కాలం.
కనురెప్ప మూసేలోపే ఋతువులు మారిపోతాయి, నిన్నటి జ్ఞాపకాలు నేటి కథలై మిగిలిపోతాయి.

నిద్రలో సగం జారిపోతే,
బ్రతుకుబాటలో మరో సగం బాధ్యతలకే అంకితమవుతుంది.
కడుపు నింపుకోవడానికి కష్టాలు,
కలలు నెరవేర్చుకోవడానికి పరుగులు,
మన ప్రమేయం లేకుండానే ముంచుకొచ్చే పరీక్షలు.
ఇదంతా ఆ చిన్న జీవితంలో అనివార్యమైన అధ్యాయమే.

కొన్ని బాధలను భరించాలి,
కొన్ని తుఫాన్లను ఎదుర్కోవాలి,
కొన్ని గాయాలను కాలానికే వదిలేయాలి.

కానీ,
బ్రతకడం మాత్రమే కాదు,
జీవితాన్ని ఆస్వాదించడం కూడా నేర్చుకోవాలి.


వర్షపు చినుకులో ఆనందం,
పిల్లల నవ్వులో పరవశం,
స్నేహంలో ఆప్యాయత,
ప్రేమలో పరిమళం వెతుక్కోవాలి.

అందుకే,
నీ పెదవులపై చిరునవ్వు చెరిగిపోనీయకు.
నీ గుండెలో వెలిగిన ఆశదీపం ఆరిపోనీయకు.
ఓటమి ఎదురైనా ప్రయత్నాన్ని విడువకు,
చీకటి చుట్టుముట్టినా నమ్మకాన్ని కోల్పోకు.

ఎందుకంటే,
జీవితం అనేది ఎన్ని రోజులు బ్రతికామన్నది కాదు, ఎంత ఆనందంగా, ఎంత అర్థవంతంగా బ్రతికామన్నదే.

చిరునవ్వును చెరిగిపోనీయకు,
ఆశను ఆరిపోనీయకు,
ప్రయత్నాన్ని ఆపేయకు.
జీవితం చిన్నదే కావచ్చు,
కానీ అందంగా జీవిస్తే
అది అనంతమైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

రామడుగు వేణుగోపాల్
దోహా , ఖతార్ (మంథని)



చట్టం సాహితీ లోకం 95814 19999

## ముందు ప్రేమలు...ఆపై ఆస్తులు..!



ఓ తల్లిదండ్రులారా...!
మీ బిడ్డలు ఎవరెస్ట్ శిఖరమంత
ఎత్తుకు ఎదగాలని కలలు కనండి...!

కానీ...వినయమే వారి విలాసం
విధేయతే వారి విజయం కావాలని నేర్పండి..!

వారు విశ్వ విద్యాలయాల
వెలుగులు దాటి
విదేశాల వైభవ వీధుల్లో విహరిస్తూ
విమానాల రెక్కలపై
విహంగాలై ఎగరాలని కోరుకోండి...!

కానీ...ఎంత ఎత్తుకు ఎదిగినా
తమను మోసిన
భుజాలను మరవకుండా...
ఎంత దూరం వెళ్లినా
తమకోసం ఎదురుచూసే
కన్నులను విస్మరించకుండా...
హృదయాలను తీర్చిదిద్దండి..!

వారు అందమైన అనుబంధాలతో
ఆనంద నిలయాలలో
పిల్లా పాపల కేరింతల మధ్య
చల్లని జీవితాలు గడపాలని కోరుకోండి...!

కానీ...భార్యాభర్తల ప్రేమలో
తల్లిదండ్రుల స్థానాన్ని చెరిపేయరాదని
కొత్తబంధాల కోసం పాతమూలాలను
నరికేయరాదని చెప్పండి..!

కాదంటే ముసలితనపు మౌనగదుల్లో
జ్ఞాపకాలే జోలపాటలౌతాయి...
ఆశలు ఆవేదనలు కన్నీటి కవితలౌతాయి..!

మీరు కష్టపడి ఆర్జించిన
ఆస్తుల్ని పిల్లలకు ప్రేమతో పంచండి...!

కానీ...మీరు పంపకాల్లో విడి పోకండి..
మీ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టకండి..
అన్నీ ఇచ్చి అనాథలుగా మిగలకండి..!

పిల్లలపై ప్రేమ ఉండాలి...పరాధీనత కాదు..
ఆప్యాయతుండాలి..ఆత్మన్యూనత కాదు..
అనురాగముండాలి..అంధవిశ్వాసం కాదు..!

పిల్లల జీవితాల్లో జోక్యం చేసుకోవద్దు...
ఆరని అపార్థాల...మారని మనస్పర్థల
మంటల్లో మనశ్శాంతిని దహించుకోవద్దు..!

కాలం మారితే...
ప్రేమలు పలుచబడితే...
అనుబంధాలు
ఆస్తుల ముందు ఓడిపోతే...
ఒక్కసారి ఈ జీవిత సత్యాన్ని...
ఈ జీవిత పరమార్థాన్ని గుర్తుచేసుకోండి...!

"అనుబంధం...
"ఆత్మీయత...అంతా ఒక బూటకమని..
"ఆత్మతృప్తికై మనుషులు
"ఆడుకునే నాటకమని వింతనాటకమని..!

కరిగే కొవ్వొత్తి కన్నీరు
ఏ కంటికి కనపడదని...
చితిమంటల చిటపటలు
ఏ స్వార్థపు చెవులకు వినపడవని...!

అందుకే...
ఓ అమాయకపు తల్లిదండ్రులారా...
ముందు పంచండి ప్రేమానురాగాల్ని..
ముందే నాటండి మానవత్వపు విలువల్ని..
అస్తమించే ముందు పంచండి...ఆస్తుల్ని..!

ఎందుకంటే...
ఆస్తి నిలబెట్టేది
నీవు నిర్మించిన నీ గృహాన్ని...
ప్రేమ నిలబెట్టేది
నీ జీవిత సుందర మందిరాన్ని...!

రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
గోవా కడలి కవి రత్న
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్
హైదరాబాద్




## సింగ్ గీతంతో కొత్తగా ఆలోచించిన దర్శకుడు

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని




# మాటే పాటయితే.. సింగీతం తరహా మూవీ

తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా భాగస్తుడిగా చేర్చుకుంటారు. అప్పటికే ఆ ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా, విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం. అసలు ఇలాంటి ఆలోచన రావడమే నిజంగా గొప్ప విషయం. ఈ విభిన్నమైన కథ ద్వారా చాలా గొప్ప విషయాలను స్పృశించారు సింగీతం. పచ్చని చెట్టు బంగారం కంటే మిన్న అనే సందేశం ఈ సినిమాతో ఆయనిచ్చారు. పర్యావరణం గొప్ప తనాన్ని తెలిపేలా ఈ సినిమా తీశారు. సింగీతం విజన్‌ని, తెరపైకి తెచ్చేందుకు నాగ్ అశ్విన్ పడిన కష్టం అణువణువునా కనిపించింది. ఈ ప్రయోగం జనానికి ఎక్కితే, ఇది కచ్చితంగా మరో గొప్ప ప్రయత్నం అవుతుందని చెప్పక తప్పదు. . ప్రయోగాత్మక చిత్రాలు ఇష్టపడే వాళ్లకు 'సింగ్ గీతం' కచ్చితంగా కొత్త అనుభూతిని ఇస్తుంది.

# జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృత్రిక్ ?







సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మీనన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# కిరణ్ అబ్బవరం కెఎ 13

## సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాద్యతలు

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

-----




# నానీ మూవీలో రుక్మిణీ వసంత్



సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.

# మా ఇంటి బంగారం సమంత కోసం వెయిటింగ్




మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించారు. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇది సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యూఏ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించింది. 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన యాక్షన్ చిత్రమిది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు.. వెచ్చించే సమయానికి.. అన్నింటికీ న్యాయం చేసేలా ఉంటుంది' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సంతోష్ నారాయణన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్.

# పూరీ మార్క్...స్లమ్ డాగ్ టీజర్

డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.



# చట్టం స్పోర్ట్స్

## లియోనెల్ మెస్సీ పాస్‌పోర్ట్ డేటా లీక్

ప్రపంచంలో అత్యధిక ఆదరణ కలిగిన క్రీడల్లో ఫుట్‌బాల్ ముందు వరుసలో ఉంటుంది. మ్యాచ్‌లను చూసేందుకు కోట్లాది మంది. మరి అలాంటి ఫుట్‌బాల్ సంగ్రామం జూన్ 11 నుంచి ప్రారంభం కానుంది. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఈ ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. కానీ, ఈ టోర్నీ ప్రారంభానికి ముందు అనేక వివాదాల్లో ఇరుక్కొంటోంది. తాజాగా, ప్రపంచ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ, ఆయన సహచరుల పాస్‌పోర్ట్ డేటా ఇప్పుడు లీకయ్యింది. మరో 24 గంటల్లో ప్రారంభం కానున్న ఫీఫా ప్రపంచ కప్ 2026ను వరుస వివాదాలు వెంటాడుతున్నాయి. తాజాగా, లియోనెల్ మెస్సీతో పాటు ఆయన అర్జెంటీనా సహచరుల పాస్‌పోర్ట్ డేటా లీక్ అయ్యింది. మంగళవారం ఐస్‌లాండ్‌తో జరిగిన ప్రపంచ కప్‌కు ముందు వార్మప్ మ్యాచ్ కోసం అర్జెంటీనా జట్టులోని లియోనెల్ మెస్సీతో సహా ప్రతి ఆటగాడి పాస్‌పోర్ట్ వివరాలు, ఒక భద్రతా లోపం కారణంగా లీక్ అయ్యాయని రాయిటర్స్ వార్తా సంస్థ ఒక నివేదికలో పేర్కొంది. అధికారిక జట్టు జాబితాలో ఉన్న పాస్‌పోర్ట్ నంబర్లు, మీడియా, ప్రజలకు విడుదల చేసే ముందు వాటిని బ్లర్ చేయాల్సి ఉంది. కానీ అలబామాలోని జోర్డాన్-హేర్ స్టేడియంలో వాటిని ఎటువంటి మార్పులు చేయకుండానే విడుదల చేశారు. కానీ, ఐస్‌లాండ్ ఆటగాళ్లు తమ పాస్‌పోర్ట్ వివరాలను సమర్పించకపోవడంతో అవి బయటకు రాలేదు. దీనిపై స్పందించాల్సింగా అర్జెంటీనా ఫుట్‌బాల్ ఫెడరేషన్, ఫీఫాను రాయిటర్స్ సంప్రదించింది. ఫిఫా ప్రపంచకప్‌ను చుట్టుముట్టిన వివాదాల్లో ఇది తాజాది. ప్రపంచకప్‌లో పాల్గొనడానికి వచ్చిన సెనెగల్ ఆటగాళ్లను అమెరికాలోని విమానాశ్రయంలో మితిమీరిన భద్రతా తనిఖీలకు గురిచేశారంటూ వచ్చిన ఒక వీడియో తీవ్ర కలకలం



రేపింది. సాడియో మానే, కాలిడౌ కౌలిబాలీ వంటి సూపర్ స్టార్స్ ఉన్న ఈ సెనెగల్ జట్టు... విమానం దిగిన తర్వాత శాన్ ఆంటోనియోలోని ఎయిర్‌పోర్ట్ టార్మాక్‌పైనే మెటల్ డిటెక్టర్లతో భద్రతా తనిఖీలు చేయించుకుంటుండగా ఎవరో వీడియో తీసినట్లు ఆరోపణలు వచ్చాయి. స్పెయిన్ వంటి జట్లకు ఇలాంటి కఠినమైన తనిఖీలు చేయలేదని, కేవలం సెనెగల్ జట్టుకే ఎందుకు చేశారని పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. న్యూయార్క్‌లో ఉజ్బెకిస్థాన్ జట్టుకు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైందని మరికొందరు ఆరోపించారు. మరోవైపు, అమెరికాలో ప్రవేశానికి అనుమతించకపోవడంతో సోమాలియాకు చెందిన ప్రపంచకప్ రెఫరీ ఒకరు బుధవారం తన దేశానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు మద్దతుదారులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తదుపరి ప్రపంచకప్‌లో తాను భాగం కావాలని కోరుకుంటోన్నానని, సోమాలియా యువత తమ దేశాన్ని చూసి గర్వపడాలని పిలుపునిచ్చారు. టోర్నమెంట్ కోసం ఫీఫా తుది జాబితాలో చోటు దక్కించుకున్న తర్వాత ఒమర్ అర్తాన్ ప్రపంచ కప్‌లో అధికారికంగా వ్యవహరించనున్న సోమాలియాకు చెందిన మొదటి రిఫరీ కానున్నారు. ఆఫ్రికాలోని అగ్రశ్రేణి రిఫరీలలో ఒకరైన ఆయన.. 2025లో ఆ ఖండంలోని ఉత్తమ పురుష రిఫరీగా ఎంపికయ్యారు. శనివారం మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలో అతడ్ని అడ్డుకోవడంపై అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ స్పందించింది. భద్రతాపరమైన ఆందోళన కారణంగా అనుమతించలేదని ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ఆ వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో ఆయన టోర్నమెంట్ రిఫరీల జాబితా నుంచి ఫీఫా తొలగించింది. గత వారం అర్తాన్‌కు అమెరికా పర్యటనకు వీసా జారీ అయిందని, దానిని ప్రాసెస్ చేసిన కెన్యాలోని సోమాలియా రాయబార కార్యాలయం తెలిపింది. అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. మియామిలోని వారి శిక్షణా కేంద్రంలో ఇతర ప్రపంచ కప్ రిఫరీలను అర్తాన్ కలవాల్సి ఉంది.

## సచిన్ ఇచ్చిన ఆ చిన్న మెసేజ్ నా మైండ్‌ను రీసెట్ చేసింది

### టీమిండియా స్టార్ బ్యాటర్లు జెమిమా రోడ్రిగ్స్

భారత మహిళా క్రికెట్ జట్టు సాధించిన చరిత్రాత్మక వన్డే ప్రపంచకప్ విజయం వెనుక ఉన్న కొన్ని ఆసక్తికరమైన రహస్యాలను టీమిండియా స్టార్ బ్యాటర్లు జెమిమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ తాజాగా వెల్లడించారు. గతేడాది నవీ ముంబై వేదికగా జరిగిన ప్రపంచకప్ సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత ఇన్నింగ్స్ ఆడిన తర్వాత.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పంపిన ఒక టైమ్లీ మెసేజ్ తనను మైండ్ రీసెట్ చేసుకునేలా చేసిందని జెమిమా రోడ్రిగ్స్ పేర్కొంది. ఆస్ట్రేలియాపై జెమిమా ఆడిన అజేయ 127 పరుగుల ఇన్నింగ్స్ భారత్‌ను తొలిసారి ప్రపంచకప్ ఫైనల్‌కు చేర్చడమే కాకుండా.. దేశవ్యాప్తంగా ఆమెపై ప్రశంసల జల్లు కురిపించింది. అయితే ఆ ఆనందంలో కొట్టుకుపోకుండా సచిన్ ఇచ్చిన సలహా తనను గ్రౌండెడ్‌గా ఉంచిందని ఆమె తెలిపింది. ఆనాటి జ్ఞాపకాలను జెమిమా గుర్తుచేసుకుంటూ.. "సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై భారీ ఇన్నింగ్స్ ఆడటం, వారిని ఓడించిన ఆనందంలో గత రెండు రోజులుగా నా చుట్టూ చాలా హడావుడి నడిచింది. ఆ సమయంలో సచిన్ సర్ నా కోచ్ ప్రశాంత్ శెట్టికి ఫోన్ చేసి, నాకు ఒక సందేశాన్ని చేరవేయమని చెప్పారు" అని తెలిపింది. సచిన్ పంపిన సందేశాన్ని వివరిస్తూ.. "అసలు పని ఇంకా పూర్తి కాలేదని సచిన్ సర్ నాకు గుర్తుచేశారు. మనం ఇంకా ఫైనల్ గెలవాల్సి ఉంది. ఆ సెమీస్ విజయాన్ని పక్కన పెట్టి, ఫైనల్లో మళ్లీ 'జీరో' నుండి ఇన్నింగ్స్ ప్రారంభించాలని ఆయన చెప్పారు. ఆ మెసేజ్ నా మైండ్‌ను రీసెట్ చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడింది" అని జెమిమా పేర్కొంది. గతంలో మనం ఏం చేశామనేది తర్వాతి మ్యాచ్‌లో మనల్ని గెలిపించదని, ప్రతి మ్యాచ్‌ను ఒక కొత్త ఆరంభంగా చూడాలని తాను అర్థం చేసుకున్నానని, ఆ దిగ్గజం ఇచ్చిన సలహా ఫైనల్‌కు ముందు తనకు ఎంతో స్పష్టతనిచ్చిందని జెమిమా జోడించింది. ఆస్ట్రేలియాను దాటుకుని ఫైనల్ చేరిన భారత్.. టైటిల్ పోరులో సౌతాఫ్రికాను ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆ ఫైనల్ మ్యాచ్‌లో 87 పరుగులతో పాటు 2/36 వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్‌ను గెలిపించిన షెఫాలీ వర్మ.. ఫైనల్‌కు ముందు తన తండ్రి ఇచ్చిన మోటివేషన్ గురించి మాట్లాడింది. "ఫైనల్‌కు ముందు మాకు రెండు రోజులు గ్యాప్ దొరికింది. ఆ సమయంలో మా



నాన్న నాకు ఒక వాయిస్ నోట్ పంపారు. 'కష్టపడి ఆడు, మైదానంలో నీ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వు. షెఫాలీ వర్మ భారత్‌కు ప్రపంచకప్ అందించిందని చరిత్రలో లిఖించబడాలి' అని ఆ వాయిస్ నోట్‌లో చెప్పారు" అని షెఫాలీ తెలిపింది. ఆ వాయిస్ నోట్ తనలో మరింత కసిని రగిల్చిందని, కేవలం తన కోసమే కాకుండా తన తండ్రి కోసం, దేశం కోసం రాణించాలనే పట్టుదలతో మైదానంలో సర్వస్వం ఒడ్డి ఆడానని షెఫాలీ వివరించింది.

## సిరాజ్‌ను తప్పించడంపై విమర్శలు

ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ఎంపిక చేసిన భారత జట్టు నుంచి మహమ్మద్ సిరాజ్‌ను తప్పించి, ప్రసిద్ధ్ కృష్ణను ఎంపిక చేయడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. వైట్ బాల్ క్రికెట్‌లో సిరాజ్‌కు వరుసగా అవకాశాలు రావడం లేదని, కేవలం బుమ్రా అందుబాటులో లేనప్పుడే అతడిని ఆడిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అలాంటప్పుడు జట్టును ప్రకటించిన కొద్ది రోజులకే 'పనిభార నిర్వహణ' పేరిట సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వడంపై సెలక్టర్ల నిర్ణయాన్ని విశ్లేషకులు తప్పుబడుతున్నారు. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో జరగబోయే టీ20 సిరీస్‌ల కోసం భారత జట్టులో మహమ్మద్ సిరాజ్ పేరు కనిపించడం కొంత ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే, అంతర్జాతీయ టీ20ల్లో సిరాజ్‌ను.. ఇటీవల పెద్దగా ఆడిన దాఖలాలు లేవు. రోహిత్ శర్మ సారథ్యంలో జూన్ 2024లో బార్బడోస్‌లో టీ20 ప్రపంచకప్ గెలిచినప్పటి నుంచి, సిరాజ్ కేవలం ఒకే ఒక ద్వైపాక్షిక టీ20ఐ సిరీస్ ఆడాడు. 2024లో శ్రీలంకతో సిరీస్‌లో బరిలోకి దిగాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో, జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చినప్పుడు యూఎస్‌ఏతో జరిగిన ఒకే ఒక్క మ్యాచ్‌లో సిరాజ్ ఆడాడు. హర్షిత్ రాణా గాయ పడటం వల్ల సిరాజ్‌కు అనివార్యంగా చోటు దక్కింది. లేకపోతే బెంచ్‌పై కూర్చొనేవాడే.మరోవైపు వన్డేలలో కూడా భారత జట్టు



ప్రణాళికల్లో సిరాజ్ ప్రాధాన్యత క్రమంగా తగ్గింది. 2023 ప్రపంచ కప్ తర్వాత, భారత్ ఆడిన 23 వన్డేలలో అతడు కేవలం తొమ్మిదింటిలో మాత్రమే ఆడాడు; ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో చోటు కోల్పోయాడు. అతడి కళ్ల ముందే ఎంతో మంది టీమిండియా తరఫున వన్డేల్లో డెబ్యూ చేశారు. ఇక అయితే జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడంతో 2025లో ఆస్ట్రేలియా సిరీస్, ఈ ఏడాది జనవరిలో న్యూజిలాండ్ వన్డేల కోసం అతడిని తిరిగి జట్టులోకి తీసుకున్నారు. 2025లో దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన సిరీస్ కోసం బుమ్రా తిరిగి వచ్చినప్పుడు, సిరాజ్ మరోసారి తుది జట్టులో చోటు కోల్పోయాడు. నిజానికి వైట్ బాల్ క్రికెట్‌లో సిరాజ్‌ను ఆడించడం అనేది.. ప్రణాళికల్లో భాగం కాదు అనే విషయం గణాంకాల ద్వారా తెలిసిపోతోంది. ఎందుకంటే పనిభారం కారణంగా బుమ్రా తప్పుకున్నప్పుడే.. ఈ హైదరాబాదీ పేసర్ వన్డే, టీ20లలో ఆడాడు. అందులో భాగంగానే ఇంగ్లాండ్, ఐర్లాండ్ టీ20ఐల కోసం బుమ్రాకు మళ్లీ విశ్రాంతినివ్వడంతో, సిరాజ్‌ను జట్టులోకి తీసు తీసుకున్నారు. కానీ జట్టును ప్రకటించిన కొద్ది రోజులకే 'పనిభార నిర్వహణ' కింద ప్రసిద్ధ్ కృష్ణను తీసుకుంటూ సిరాజ్‌ను తప్పించడం ఆశ్చర్యం కలిగించింది. భారత టీ20 ప్రణాళికల్లో దాదాపుగా చోటు దక్కించుకోలేక, వన్డేలలో కూడా ప్రాధాన్యత కోల్పోయిన ఒక బౌలర్‌కు అకస్మాత్తుగా విశ్రాంతి ఎందుకు అవసరమైంది? అనే ప్రశ్నపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఈ ప్రశ్నకు బీసీసీఐ, భారత సెలక్టర్ల వద్ద సమాధానం ఉందా.. అంటే లేదనే సమాధానం వినిపిస్తోంది.

## అక్టోబర్ 4 నుండి ఐసీసీ వన్డే ప్రపంచకప్

### 2027 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల



క్రికెట్ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐసీసీ మెన్స్ వన్డే వరల్డ్ కప్ తాత్కాలిక షెడ్యూల్ వచ్చేసింది. అక్టోబర్ 4 నుండి నవంబర్ 21 ఈ మెగా టోర్నీ జరగనున్నట్టు తెలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలలో ఈ మ్యాచ్‌లు జరగనున్నట్టు తెలుస్తోంది. గత నెలలో అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐసీసీ బోర్డు మీటింగ్ ఈ తేదీలపై ఏకాభిప్రాయం కుదిరిందని.. జూలైలో ఎడిన్‌బర్గ్‌లో జరగబోయే ఐసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ తేదీలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని నివేదికలు స్పష్టం చేశాయి.ఈ నివేదిక ప్రకారం..ఈ మెగా టోర్నీలోని మెజారిటీ మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలోనే జరగనున్నట్టు తెలుస్తోంది. ఈ టోర్నమెంట్ మొత్తంలో 54 మ్యాచ్‌ల జరగనుండగా అందులో సుమారు 41 మ్యాచ్‌లుకు దక్షిణాఫ్రికాలోని 8 స్టేడియాలు ఆతిత్యం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇక జింబాబ్వేలోని విక్టోరియా ఫాల్స్, హరారే స్పోర్ట్స్ క్లబ్, బులవాయోలోని క్వీన్స్ స్టేయాల్లో 8 నుండి 10 మ్యాచ్‌లు జరగనుండగా మిగతా మూడు మ్యాచ్‌లు నమీబియాలో జరగనున్నాయి. అయితే ఇప్పటి వరకు టీ20 ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ, మహిళల టీ20 ప్రపంచ కప్‌లకు ఆతిథ్యం ఇచ్చిన సౌత్రాఫ్రికా 2003 మూడు తర్వాత తొలిసారి మెన్స్ వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను నిర్వహించబోతుంది. అయితే ఈ వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను పాత పద్ధతిలోనే నిర్వహించబోతుంది. గతంలో జరిగిన రెండు ఎడిషన్లలో కేవలం 10 జట్లే పాల్గొనగా.. తాజాగా 2027లో జరగబోయే మెన్స్ వరల్డ్ కప్‌లో మళ్లీ 14 జట్ల ఫార్మాట్‌ను తీసుకురాబోతున్నారు.. అంటే మొత్తం 14 జట్లను రెండు గ్రూప్‌లుగా డివైడ్ చేసి.. ప్రతి గ్రూప్ నుండి టాప్ 3 స్థానాల్లో నిలిచిన జట్లను సూపర్ సిక్స్‌కు ఎంపిక చేస్తారు. ఇక ఐసీసీ సభ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలు దీనికి నేరుగా అర్హత సాధించగా, నమీబియా మాత్రం క్వాలిఫికేషన్ మ్యాచ్ ఆడిన తర్వాత సూపర్ సిక్స్‌కు రావాల్సి ఉంటుంది.

## టీ20 శైలిలో ఆడిన వైభవ్



భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై అధిక అంచనాలు పెట్టుకోవద్దని హెచ్చరించారు. వైభవ్ లాంటి ప్రతిభావంతుడైన యువ క్రికెటర్‌ను తనదైన శైలిలో ఎదగనివ్వాలని సౌరవ్ అన్నారు. అయితే, వైభవ్ రోజూ తనపై తానే అంచనాలను పెంచుకుంటున్నాడు. ప్రస్తుతం జాతీయ జట్టులో ఉన్న వైభవ్, ఇండియా 'ఎ' జట్టు తరఫున ఆడినప్పటి నుంచి మంచి ఫామ్‌లో ఉన్నాడు.అద్భుతమైన, ఆశాజనకమైన ఆరంభం లభించినప్పటికీ, యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈరోజు ఇండియా 'ఎ' తరఫున తన తొలి అర్ధశతకాన్ని సాధించలేకపోయాడు. గురువారం దంబుల్లాలో ఆఫ్ఘనిస్తాన్ 'ఎ'తో జరిగిన ఇండియా 'ఎ' రెండవ లీగ్ మ్యాచ్‌లో, సూర్యవంశీ 44 పరుగులు చేసి పెవిలియన్‌కు తిరిగి వచ్చాడు. అంతకుముందు వరుస బౌండరీలతో మెరిసిన వైభవ్, అర్ధశతకం సాధించలేకపోయాడు. టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ఎంచుకున్న భారత ఆటగాళ్లు ప్రభసిమ్రన్ సింగ్, వైభవ్ ఆరంభం నుంచే ఆఫ్ఘన్ బౌలర్లను దండించారు. వైభవ్ 22 బంతుల్లో 9 ఫోర్ల సహాయంతో 44 పరుగులు చేశాడు. అతను అర్ధశతకానికి 6 పరుగుల దూరంలో అవుటయ్యాడు. కానీ, 15 ఏళ్ల బ్యాట్స్‌మెన్ వైభవ్ బ్యాటింగ్ శైలి అందరి దృష్టిని ఆకర్షించింది.వైభవ్ సూర్యవంశీ ఆడిన తీరు చూస్తే, అతను ఒక వన్డే మ్యాచ్‌ను టీ20 మ్యాచ్‌గా మార్చేశాడు. అతను వరుసగా రెండు బౌండరీలతో జట్టుకు బలమైన ఆరంభాన్ని అందించాడు. అంతకుముందు, శ్రీలంక 'ఎ' జట్టుపై వైభవ్ కేవలం 14 పరుగులకే ఔటయ్యాడు, కానీ ఆఫ్ఘనిస్తాన్ 'ఎ' జట్టుపై అతను అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని నిరూపించుకున్నాడు.గత సంవత్సరం, వైభవ్ ఇంగ్లాండ్ అండర్-19 జట్టుపై కేవలం 52 బంతుల్లోనే సెంచరీ సాధించి వన్డే క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డును నెలకొల్పాడు. ఆ సమయంలో ఆ రికార్డు గురించి తనకు తెలియదని చెప్పినప్పటికీ, వైభవ్ ఇలా అన్నాడు, "తదుపరి మ్యాచ్‌లో, పూర్తి 50 ఓవర్లు ఆడి 200 పరుగులు చేయడానికి ప్రయత్నిస్తాను. నేను ఎంత ఎక్కువ పరుగులు చేస్తే, జట్టుకు అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది." నేటి మ్యాచ్‌లో, ఆఫ్ఘనిస్తాన్ ఆఫ్-సైడ్ ఫీల్డర్లు చాలా పటిష్టంగా ఉన్నా, బౌండరీ వద్ద స్వీపర్ కవర్ కీపర్ ఉన్నా, సూర్యవంశీ తాను క్రీజులో ఉన్న 22 బంతుల సమయంలో అసాధారణమైనదేమీ చేయడానికి ప్రయత్నించలేదు. దానికి బదులుగా, అతను బంతి తన వద్దకు వచ్చే వరకు వేచి ఉండి, ఆలస్యంగా ఆడాడు. దీనివల్ల అతను ఆఫ్-సైడ్‌లోని ఖాళీలోకి బంతిని సులభంగా పంపగలిగాడు. వైభవ్‌ను అవుటయ్యేలా చేసిన బంతి ఆఫ్ స్టంప్‌కు బయటగా వచ్చిన బౌన్సర్ అని గమనించాలి. మరోసారి, ఆఫ్ స్టంప్‌కు బయటగా వచ్చిన బౌన్సర్‌కే వైభవ్ అవుటయ్యాడు. ఇన్నింగ్స్‌లోని ఏడవ ఓవర్‌లో అతను చేసిన మరో పొరపాటు అతనికి భారీ మూల్యం చెల్లించేలా చేసింది.

## ప్రపంచకప్‌లో ఫియర్‌లెస్ గేమ్ ఆడుతాం

### టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్



ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఫియర్‌లెస్ గేమ్ ఆడుతామని టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. పాకిస్థాన్‌తో జరిగే తొలి మ్యాచ్ నుంచే ఫియర్‌లెస్ అప్రోచ్‌ను అనుసరిస్తామని స్పష్టం చేసింది. దాయాదీ పాకిస్థాన్‌తో ఆదివారం బర్మింగ్‌హామ్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో హర్మన్‌సేన్ టీ20 ప్రపంచకప్ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఈ మెగా టోర్నీకి ముందు రెండు వామప్ మ్యాచ్‌లు ఆడిన భారత్ ఒకటి గెలిచి మరొకటి ఓడింది. ఇంగ్లండ్‌తో వామప్ మ్యాచ్ పరాజయం అనంతరం మీడియాతో మాట్లాడిన హర్మన్‌ప్రీత్ కౌర్.. ఈ మ్యాచ్‌లు మెగా టోర్నీ ప్రారంభానికి ముందు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయని తెలిపింది. 'ఈ రెండు ప్రాక్టీస్ గేమ్స్ మాకు మంచి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ.. రిచా ఘోష్ బ్యాటింగ్ మాకు పెద్ద సానుకూల అంశం. క్రీజులో నిలబడితే ఎప్పుడైనా మ్యాచ్‌ను మలుపు తిప్పగలమనే నమ్మకం మాకు కలిగింది. కీలకమైన భాగస్వామ్యాలను నెలకొల్పకపోవడంతోనే ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఓటమిపాలయ్యాం. టీ20 క్రికెట్‌లో మిడిల్ ఓవర్లలో భాగస్వామ్యాలు చాలా కీలకం. అవి మాకు దక్కలేదు. కానీ రిచా అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. మెగా టోర్నీకి ముందు జట్టులోని ప్రతీ ప్లేయర్‌కు అవకాశాలు కల్పించడంపై మా మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందరికి తగినన్ని అవకాశాలు వచ్చాయి. టోర్నీలో తొలి మ్యాచ్ నాటికే ఇక్కడి పరిస్థితులపై అవగాహన తెచ్చుకోవడం చాలా కీలకం.తొలి మ్యాచ్‌లోనే పాకిస్థాన్‌ను ఢీకొట్టబోతున్నాం. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా చూస్తారనడంలో సందేహం లేదు. బర్మింగ్‌హామ్ మైదానానికి కూడా పెద్ద ఎత్తున వస్తారని భావిస్తున్నా. ప్రేక్షకుల కోలాహలంతో స్టేడియం హోరెత్తిపోతుంది. మేం కూడా మ్యాచ్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం. నిర్భయంగా ఆడేందుకు ప్రయత్నిస్తాం. దూకుడును కొనసాగించి విజయం సాధిస్తాం.'అని హర్మన్ ప్రీత్ కౌర్ తెలిపింది.పాకిస్థాన్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లతో భారత్ గ్రూప్-ఏలో ఉంది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేదు. 2020లో ఫైనల్ చేరుకున్నప్పటికీ ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. తాజా ఎడిషన్ అతిపెద్ద టోర్నీగా నిలవనుంది. ఇందులో తొలిసారిగా 12 జట్లు పోటీపడుతున్నాయి.ఆతిథ్య దేశం ఇంగ్లండ్‌తో పాటు, భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక, వెస్టిండీస్, న్యూజిలాండ్ జట్లు నేరుగా అర్హత సాధించాయి. బంగ్లాదేశ్, స్కాట్లాండ్, ఐర్లాండ్, నెదర్లాండ్స్ జట్లు క్వాలిఫయర్ల ద్వారా ఈ టోర్నీకి ఎంపికయ్యాయి. ఈ టోర్నీలో మొత్తం 33 మ్యాచ్‌లు ఏడు వేదికల్లో జరగనున్నాయి.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999